క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే రాక

చిన్నమండెం : మండల పరిధిలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీలో నేడు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పాల్గొనే ఈ కార్యక్రమానికి గ్రామానికి చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ప్రభుత్వం దృష్టికి ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల సమస్యలు

రాయచోటి అర్బన్ : సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గత కొద్ది రోజులుగా జిల్లా కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపడుతున్న నిరవధిక దీక్ష శిబిరాన్ని మంగళవారం శ్రీకాంత్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగుల సమస్యలు విన్న ఎమ్మెల్యే స్పందిస్తూ ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల సమస్యలను విద్యాశాఖ మంత్రి, స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానంటూ వారికి హామీనిచ్చారు.

పార్టీ విజయానికి పనిచేద్దాం



పుత్తా ప్రతాప్‌రెడ్డితో మైనార్టీ నేత కరీముల్లా

రాజంపేట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం చేసుకోవాలని, అందుకు కార్యకర్తలందరూ సన్నద్ధం కావాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి (మైనార్టీ విభాగం) కరీముల్లా అన్నారు. మంగళవారం ఆయన ఇక్కడి విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు సమన్వయకర్త పుత్తా ప్రతాప్‌రెడ్డిని విజయవాడలో కలిసినట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రతి గడపకూ సంక్షేమం, మేలు జరగాలంటే తప్పనసరిగా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.

గడ్డి విత్తనాలు పంపిణీ

చిట్వేలి : రైతులకు సబ్సిడీపై గడ్డి విత్తనాలను మంగళవారం మంగళవారం రాజంపేట పశు సంవర్ధకశాఖ ఉప సంచాలకులు ఎర్రంశెట్టి విజయభాస్కర్ పంపిణీ చేశారు. స్థానిక ప్రాంతీయ పశు వైద్యశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పశు గ్రాసాల సాగుతో రైతుకు ఆదాయంతోపాటు పాల దిగుబడి బాగుంటుందన్నారు. ఈ సంవత్సరం ప్రతి రైతుకు పశుకిసాన్ క్రెడిట్ కార్డు అందించేందుకు వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని సూచించారు. గాలికుంటు వ్యాధి నివారణకు పెనగలూరు మండలం, ఈటమాపురంలో మంగళవారం నుంచి ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రాంతీయ పశువైద్యశాల ఏడీ వరప్రసాద్, పశువైద్యులు వేదవతి, భువనేశ్వరి, గోపాలమిత్రలు శివప్రసాద్, డీఈఓ నాయక్, సీఆర్పీ జ్యోతి పాల్గొన్నారు.

కోర్టులో న్యూ ఇయర్ వేడుకలు



జడ్జికి శుభాకాంక్షలు తెలుపుతున్న లాయర్లు

నందలూరు(రాజంపేట) : నందలూరు జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్‌లో నూతన సంవత్సర వేడుకలను జూనియర్ సివిల్ జడ్జి కె.లత ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా న్యాయవాదులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ కొత్త సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నరసింహులు, ప్రధాన కార్యదర్శి సుబ్బరామయ్య, వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ అలీ, ఏజీపీ షమీవుల్లా ఖాన్, న్యాయవాదులు ఏవీ సుబ్రమణ్యం, అనుదీప్, జయసింహా, మోహన్, మహమ్మద్ అలీ, నూరు, శివశంకర్ రెడ్డి, నళిని, మీనా పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎంపీడీఓ దివ్య తెలిపారు. గ్రామంలోని 312 మందికి డా.షేక్ రియాజ్, డా.రఫీవుల్లాబేగ్, స్పెషలిస్ట్ వైద్యుడు రెడ్డినరేష్, డా.శ్రావణిలు పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ, వైద్య సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

రాజంపేట టౌన్ : పశువులకు సోకే గాలికుంటు వ్యాధిపట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకులు వై.విజయభాస్కర్‌రావు తెలిపారు. 32వ జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్ని మంగళవారం ఆయన రాజంపేట పట్టణంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా భాస్కర్‌రావు మాట్లాడుతూ పశువులకు గాలికుంటు వ్యాధి సోకితే పాడి రైతులు నష్టపోవాల్సి వస్తుందన్నారు. ఈ వ్యాధి వల్ల పాల దిగుబడి బాగా తగ్గిపోతుందని తెలిపారు. ఈనెల 31వ తేదీ వరకు జరిగే గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్ని పాడి రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు డాక్టర్ కె.ప్రతాప్, జూనియర్ వెటర్నరీ అధికారి ఎం.వరదయ్య పాల్గొన్నారు.

మాటకు కట్టుబడ్డాం.. పింఛన్ పెంచాం

- మండలంలో 224 కొత్తపింఛన్లు
- హామీ నెరవేర్చిన సీఎం జగన్‌కు అండగా నిలుద్దాం
- పింఛన్ల పెంపు ఉత్సవాల్లో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు



పింఛన్ కానుకను అందజేస్తున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు



కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరైన పింఛన్ లబ్ధిదారులు

ఓబులవారిపల్లె : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పాడంటే చేస్తాడంతేనని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. మంగవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో ఎంపీపీ చీర్ల నాగమ్మ అధ్యక్షతన పెంచిన వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కొరముట్ల మాట్లాడుతూ గత ప్రభుత్వం పింఛన్‌ల పంపిణీని నిర్లక్ష్యం చేసిందన్నారు. అప్పటి టీడీపీ ప్రభుత్వం కేవలం 33 లక్షల పింఛన్లను అందిస్తే, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 66.34లక్షల పింఛన్‌లను అందిస్తోందన్నారు. 2019 ఎన్నికల సమయంలో పింఛన్‌దారులకు మాటిచ్చిన విధంగా దశలవారీగా పెంచుతూ ఇప్పుడు మూడు వేలు చేశామని గుర్తుచేశారు. చంద్రబాబు హయాంలో గంటలు, రోజుల తరబడి వేచివున్న పింఛన్ అందేదికాదని.. నేడు వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఠంఛన్‌గా ప్రతి గడపకూ పింఛన్ అందుతోందన్నారు. ఓబులవారిపల్లె మండలంలోనే 224 నూతన పింఛన్‌లను మంజూరు చేశామని, దీంతో మండలంలో పింఛన్‌దారుల సంఖ్య ఏడు వేలకుపైగా చేరిందన్నారు. వీరి కోసం ప్రతి నెల రెండు కోట్లకు పైగా డబ్బును అందిస్తున్నట్లు వివరించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు అందరూ అండగా నిలవాలని చెప్పారు. సాయికిషోర్‌రెడ్డి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్ మంజూరు చేస్తున్నామన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని కొనియాడారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా కొరముట్ల శ్రీనివాసులును గెలిపించుకొని సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకుందామని తెలియజేశారు. అంతకుముందు మాజీ సర్పంచ్ ముక్కా రమేష్‌కుమార్ రెడ్డి ప్రభుత్వవిప్‌ను, ఏపీటీడీసీ డైరెక్టర్‌ను సన్మానించారు. అనంతరం పింఛన్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి నాగభూషణం, సింగల్ విండో మాజీ అధ్యక్షులు టి.కృష్ణారెడ్డి, సర్పంచ్‌లు జయపాల్‌రెడ్డి, జరుగు నారాయణరెడ్డి, మల్లెం ఈశ్వరయ్య, అల్ల ఈశ్వరయ్య, మినుగు సుధాకర్, కానిపాకం సుబ్బలక్షుమ్మ, జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ సుంకేసుల రఫీ, డీఆర్‌సీసీయూ మెంబర్ భరత్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీఓ విజయారావు, వైస్ ఎంపీపీ సుమిత్ర, సీనియర్ నాయకులు కొమ్మిరెడ్డి సూబ్బారెడ్డి, గంగిరెడ్డి, ఎంపీటీసీలు వత్తలూరు రోహిణికూమార్‌రెడ్డి, పైడి గిరినాయుడు, దుర్గ ప్రసాద్, కాగితపు సూజాత, యానదమ్మ, హరిబాబు పార్టీ నాయకులు, అధికారులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

అలసత్వం వహిస్తే చర్యలు

రాజంపేట టౌన్ : సచివాలయ ఉద్యోగులు ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని డివిజనల్ స్థాయి అభివృద్ధి అధికారి (డీఎల్‌డీఓ) మూర్తి తెలిపారు. పట్టణంలోని ఆర్‌ఎస్ రోడ్డు - 1, 2 సచివాలయాలను మంగళవారం డీఎల్‌డీఓ అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వివిధ పథకాలు అమలు తీరు, ప్రజల సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను కంప్యూటర్‌లో పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన ఉద్యోగులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. సమస్యల పరిష్కారం పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

రాజంపేట : జాతీయస్థాయి కుస్తీ పోటీల్లో ఏబీటీఎస్ విద్యార్థి నరసింహ పవన్‌రెడ్డి ప్రతిభ చాటి కాంస్య పతకం సాధించాడు. గత నెల 28 నుంచి 30వ తేదీ వరకు విశాఖ రామకృష్ణ బీచ్‌లో ఈ పోటీలు జరిగాయి. అలానే ఫిబ్రవరిలో కొట్టాయంలో మహాత్మా గాంధీ యూనవర్సిటీలో సౌత్‌జోన్ ఇంటర్ యూనవర్సిటీ హ్యాండ్‌బాల్ టోర్నమెంట్‌కు మల్లికార్జునరెడ్డి ఎంపికయ్యాడు. మంగళవారం వీరిని ఏబీటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి అభినందించారు. క్రీడలకు కళాశాలలో ప్రాధాన్యం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణ, పీడీ నాగముని, ఏపీడీ సైపుల్లా, విద్యార్థులు పాల్గొన్నారు.

కాలానుగుణంగా బోధనల్లో మార్పు రావాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ జిల్లా డీఈఓ వై.రాఘవరెడ్డి

రాయచోటి అర్బన్ : రాయచోటి డైట్ కళాశాల అధ్యాపక బృందం రచించిన అక్షర వాణి మాసపత్రిక పుస్తకావిష్కరణ కార్యక్రమం మంగళవారం కడప జిల్లా విద్యాశాఖాధికారి, డైట్ ప్రిన్సిపల్ వై.రాఘవరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్షరవాణి పత్రికలో కడప జిల్లా అస్తిత్వం, చరిత్ర, సంస్కృతి, సాహిత వైభవాన్ని వివరించారన్నారు. ఉపాధ్యాయులు కాలంతోపాటు మారుతున్న సాంకేతికత, సృజనాత్మకత, మూల్యాంకనం, సృజనాత్మక ఆలోచనలు పంచుకోవడానికి ఈ పత్రిక మాధ్యమంగా పనిచేస్తుందన్నారు. బోధన అనేది జీవితకాల ప్రక్రియ అని దానిని మెరుగుపరుచుకోవడానికి ఉపాధ్యాయులు తమ అత్యుత్తమ సాధనను అక్షరవాణి పత్రిక ద్వారా తెలియజేసే అవకాశం ఉందన్నారు. ఉపాధ్యాయుల అవసరమైన బోధన, అభ్యాసన సామగ్రి, శిక్షణ, వర్క్‌షాపులకు సంబంధించిన వివరాలు ఇందులో పొందుపరచడం జరిగిందన్నారు. పాఠశాల విద్యార్థులకు అవసరమైన రిక్రియేషన్ యాక్టివిటీస్‌ని కూడా ఇందులో తెలియజేశారని చెప్పారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఈ డిజిటల్ మ్యాగజైన్‌ను అందరూ డౌన్‌లోడ్ చేసుకుని తమ తమ పాఠశాలల్లో ఉపయోగించుకోవాలంటూ తెలియజేశారు. కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు శివభాస్కర్, వై.సి.రెడ్డెప్పరెడ్డి, శ్రీదేవి, జాఫర్, రెడ్డెయ్య, అసద్, నాగరాజు, నాగేశ్వరరావులు పాల్గొన్నారు.

ముగిసిన ఆరాధనోత్సవాలు

రామాపురం : కేవలానంద లక్ష్మణార్య వార్షిక ఆరాధనోత్సవాలు మంగళవారం ముగిశాయి. మహిమాన్వితుడుగా 64 సంవత్సరాల నుంచి పూజలందుకుంటూ రాయలసీమ భక్తుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని భక్తులు కొనియాడారు. ఎంతో మందికి నేటికీ సంతానం లభిస్తోందనే భక్తుల విశ్వాసం. పలువురు ఆధ్యాత్మిక ఉపన్యాసాలు భక్తులకు వినిపించారు. పాలన్నగారిపల్లె, సరస్వతిపల్లె కాలనీ, రాయచోటి, మదనపల్లె, కడప తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు భజనలు నిర్వహించారు. మూడు రోజులు జరిగిన పూజల్లో భక్తులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కమిటీ ఏర్పాటు

రాజంపేట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ నందలూరు మండల కమిటీ వివరాలను ఆ పార్టీ కేంద్ర కార్యాలయం విడుదల చేసింది. అధ్యక్షుడిగా అన్నం నాగేంద్ర(లేబాక), ఉపాధ్యక్షులుగా తోకల వెంకటరమణ, యాటగిరి మల్లీశ్వరి, ప్రధాన కార్యదర్శులుగా గాదె నాగభూషణం, పెనుబాల దీప్తి, కోశాధికారిగా హెచ్‌డీ ప్రసాద్, కార్యదర్శులుగా శ్రీనివాసులు, నాగమణి, నారపురెడ్డి వెంకటరామిరెడ్డి, సంభావన హైమావతి, మండ్ల ఆంజనేయులును నియమించారు. అలానే కమిటీ సభ్యులుగా శివకుమార్ రాజు, కరీముల్లా, ఆసీరుఫీన్నాషా, వెలకచర్ల అరుణకుమార్, చింతకాయల వెంకటరత్నం, చుక్కా ఎల్లయ్య, టంగుటూరు రంగయ్య, పుత్తా శేఖర్, బుర్రి చిన్నకేశవులు, ఎంజే ఇమ్మానుయేల్, ఎం.కనకయ్య, ఎం.వెంకటప్రసాద్, షేక్ తాజుద్దీన్, సబియాలు నియమితులయ్యారు.

అన్నదానం

రామాపురం : అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదని మండల జెడ్పీటీసీ మాసన వెంకటరమణ పేర్కొన్నారు. మంగళవారం ప్రేమాలయంలో మాసన రెడ్డయ్య 3వ వర్ధంతి సందర్భంగా భార్య గంగులమ్మ, కుమారుడు జెడ్పీటీసీ వెంకటరమణ, వీఆర్‌ఓ నరసింహులు ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం నిర్వహించారు.

ఉపాధ్యాయుల హక్కుల సాధనకు కృషి

- జిల్లా ఎస్టీయూఎఫ్ కార్యవర్గం ఏర్పాటు
- పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామాంజనేయులు



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్టీయూఎఫ్ నాయకులు

రాయచోటి టౌన్ : ఎస్టీయూఎఫ్ అన్నమయ్య జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం రాయచోటిలోని ఎస్టీయూఎఫ్ కార్యాలయంలో రాష్ట్ర ఎస్టీయూఎఫ్ అధ్యక్షుడు ఎస్.రామాంజనేయులు ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ జరిగింది. గౌరవాధ్యక్షులుగా బెల్లం జనార్దన్‌రెడ్డి, అధ్యక్షుడిగా నూకల నరసరాజు, ప్రధాన కార్యదర్శిగా టి.చెన్నకృష్ణారెడ్డి, ట్రెజరర్‌గా షేక్ సలాం, వైస్ ప్రెసిడెంట్‌గా వైవీ సత్యకుమార్, కేతినేతి వెంకట సుబ్బయ్య, డి.గాయత్రి, జాయింట్ సెక్రటరీగా ఎం.నాగమహేశ్వరయ్య, ఎ.రామాంజనేయులు, అడిషనల్ జాయింట్ సెక్రటరీగా ఎ.లక్ష్మీనారాయణ రెడ్డి, టి.రామ్‌ప్రసాద్, కార్యదర్శులుగా వెంకటసుబ్బయ్య రాయల్, ప్రదీప్‌రెడ్డి, ఏఎస్‌ఎన్ గౌడ్, పాలెం శివఫణీంద్ర, చిన్నరాజాలను ఎంపిక చేశారు. అనంతరం రామాంజనేయులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటాలు చేసి తమ హక్కులను సాధించుకోవడానికి కృషి చేస్తామన్నారు. ఎలాంటి సమస్యలు వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేవరకు ఎల్లవేళలా కృషి చేస్తామని చెప్పారు. అనంతరం డైట్ కళాశాల ప్రాంగణంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఎన్నికల పరిశీలకుడిగా వైఎస్‌ఆర్ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవులు రామచంద్ర వ్యవహరించారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు సీమల శ్రీనివాసులు, వైఎస్‌ఆర్ కడప కార్యదర్శి వెంకటసుబ్బయ్య, సభ్యులు సాగర్, కేశవ, వెంకటసుబ్బయ్య, పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు అభ్యసించాలి

పాల్గొన్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, పోలా



పండ్లు పంపిణీ చేస్తున్న ఆకేపాటి, పోలా

రాజంపేట టౌన్ : విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యం కాగలదని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తెలిపారు. స్థానిక ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో, భవిత కేంద్రాల్లో మంగళవారం విద్యార్థుల నడుమ నూతన సంవత్సర వేడుకలను జెడ్పీ చైర్మన్ మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డితో కలిసి నిర్వహించారు. అనంతరం కేక్, పండ్లు పంపిణీ చేశారు. ఆకేపాటి మాట్లాడుతూ హాస్టల్స్‌లో ఉంటూ చదువుకునే విద్యార్థులంతా నిరుపేదలని, అందువల్ల ప్రతి విద్యార్థి ఇష్టంతో కష్టపడి చదివి ఉన్నత చదువులు అభ్యసించాలని ఆకాంక్షించారు. ఉన్నత చదువులు చదివితేనే పేదరికం నుంచి బయటపడగలరన్నారు. పేదరికం లేని సమాజాన్ని స్థాపించడం కోసమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు వేలాది కోట్ల రూపాయిలు ఖర్చు చేస్తున్నారన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పోలి మురళీరెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు జెనుగు కృష్ణారావుయాదవ్, కౌన్సిలర్ న్యామతుల్లా, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపి, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు డీలర్ సుబ్బరామిరెడ్డి, పాపినేని విశ్వనాథరెడ్డి, రెడ్డిమాసి రమేష్‌నాయుడు, దాసరి పెంచలయ్య, జాహిద్‌అలీ, అబ్దుల్ మునాఫ్, శంకర్‌శెట్టి తదితరులు పాల్గొన్నారు.

చెత్తసేకరణకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు



సచివాలయం కార్యదర్శులతో పారిశుధ్యంపై సమీక్షిస్తున్న కమిషనర్ గంగాప్రసాద్

రాయచోటి అర్బన్ : రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తున్న నేపథ్యంలో పట్టణంలో చెత్తసేకరణ, పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణపై సచివాలయం శానిటేషన్ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు సమ్మెలో 97 మంది ఉండగా, రేపటి నుంచి మరో 72 మంది సమ్మెలోకి వెళ్లనున్నట్లు తెలిపారు. ఈ పరిస్థితులలో బుధవారం నుంచి 50 మంది దినసరి కూలీలతో పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. చెత్తసేకరణ ఆటోలను సైతం వీధులలోకి పంపి చెత్తను సేకరించేలా కార్యాచరణను రూపొందించినట్లు పేర్కొన్నారు. పట్టణ ప్రజలు, వ్యాపారులు చెత్తను ఎక్కడపడితే అక్కడ పడవేయకుండా డంపర్ బిన్‌లలో, చెత్తసేకరణ ఆటోలకు చెత్తను అందజేసి పట్టణ పరిశుభ్రతకు సహకరించాలంటూ కోరారు. సమీక్షలో మున్సిపల్ ఆర్‌ఐ మల్లికార్జున, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కొండయ్య, మేస్త్రీలతోపాటు సచివాయం కార్యదర్శులు పాల్గొన్నారు.

పేదింటి పెద్ద కొడుకు సీఎం వైఎస్ జగన్

- అవ్వాతాతల ఆనందమే లక్ష్యం
- రూ.3 వేలకు పింఛన్‌ను పెంచి మాట నిలబెట్టుకున్న సీఎం జగన్
- పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



లబ్ధిదారుకు పింఛన్ నగదు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రామాపురం : పేదింటి పెద్ద కొడుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన పింఛన్ల పెంపు, నూతన పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. మాజీ ఎంపీపీ గడికోట జనార్దన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో తొలుత సీఎం జగన్ అవ్వాతాతలకు రాసిన లేఖను ఎమ్మెల్యే చదివి వినిపించారు. అనంతరం మాట్లాడుతూ మలిసందెల్లో ఆసరా కోసం ఎదురు చూసే అవ్వాతాతలకు సీఎం జగన్ అండగా నిలుస్తున్నారన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఒకరు చనిపోతే కానీ మరొకరికి పెన్షన్ ఇచ్చేవారు కాదన్నారు. మహానేత వైఎస్సార్ అర్హులైన వారందరికీ పెన్షన్లు మంజూరు చేశారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన సంవత్సరానికే రూ.2250 చేసి క్రమంగా పెంచుకుంటూ పింఛన్‌ను రూ.3వేలు చేశారన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం దిగిపోయే సమయంలో రాష్ట్రంలో 39లక్షలు పెన్షన్లకు రూ.400 కోట్లు మాత్రమే అందించేవారని, సీఎం జగన్ ఇప్పుడు 66.34లక్షల మందికి పెన్షన్లు ఇస్తున్నారని, నెలకు రూ.1,900 కోట్లు పెన్షన్ల రూపంలో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందన్నారు. అలానే సచివాలయం, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలను పెట్టి నేరుగా ప్రజల ఖాతాలలో జమ చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో వందలాది రైతులకు వ్యవసాయ విద్యుత్ సర్వీసులను అందించామన్నారు. మండలంలో 4 వేలకు పైగా నూతన పక్కా గృహాలను మంజూరు చేయించామన్నారు. భూమిలేని పేదలకు పట్టాలు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ ప్రభుత్వంలో మేలు జరిగింటేనే సీఎం జగన్‌కు మద్దతుగా నిలుద్దామని, ఈ విధంగా చెప్పే వ్యక్తిని ఎక్కడా చూసి ఉండమన్నారు. అర్హతే ఆధారంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న మనస్సున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ప్రతి చెరువుకు కృష్ణా జలాలను అందించి తీరుతామని స్పష్టం చేశారు.

చంద్రబాబు మాటలను నమ్మకండి

చంద్రబాబు ఎన్నికల వేళ అన్ని ఫ్రీగా ఇస్తామని చెప్తారు కానీ, ఎన్నికలు అయిన తరువాత అడిగితే నేనెప్పుడు చెప్పానని ఎదురు ప్రశ్నిస్తారన్నారు. చంద్రబాబు మాటలను ఏ ఒక్కరూ నమ్మొద్దని కోరారు.

కార్యక్రమంలో రెస్కో మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ మాసన వెంకటరమణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కర్జపు విశ్వనాథరెడ్డి, వైస్ ఎంపీపీలు రవిశంకర్‌రెడ్డి, బాబు, సింగల్ విండలో అధ్యక్షులు పెద్దిరెడ్డి, ఆదినారాయణరెడ్డి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఆంజనేయులు, యువజన విభాగపు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరం వెంకటసుబ్బారెడ్డి, సర్పంచ్‌లు నాగభూషన్‌రెడ్డి, వెంకటరెడ్డి, మునీర్, బసిరెడ్డి, ఆంజనేయులు, రామాంజులు, శంకరయ్య, అయూబ్, వెంకట్రామిరెడ్డి, రఘురామయ్య, శివయ్య, సుబ్బయ్య, ఎంపీటీసీలు మౌలా, నారాయణ, సుబ్బారెడ్డి, యశోదమ్మ, ఖాదర్‌వలి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య శ్రీ పరిమితి పెంపు చారిత్రాత్మకం



సమావేశానికి హాజరైన పింఛన్‌దారులు

ఆరోగ్య శ్రీ పరిమితిని రూ. 25 లక్షలకు పెంచడం చారిత్రాత్మకమని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలో నూతన ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సమావేశంలో మాట్లాడుతూ రూ.5లక్షలుగా ఉన్న ఆరోగ్య శ్రీ కార్డు పరిమితిని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏకంగా రూ. 25లక్షలకు పెంచడం ఆరోగ్య శ్రీ పథకంలో మరో మైలురాయి అని పేర్కొన్నారు. వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కార్డు ఉందంటే ఆ వ్యక్తికి రూ.25లక్షల వరకు వైద్యం ఉచితంగా లభిస్తుందన్నారు. ఎలాంటి సమస్యలు వచ్చినా వైఎస్సార్ ఆరోగ్య శ్రీ అండగా నిలుస్తుందన్నారు. అన్ని రకాల క్యాన్సర్‌లకు పరిమితి లేకుండా ఉచితంగా వైద్యం అందిస్తున్నారన్నారు. వార్షిక ఆదాయం రూ.5లక్షలు ఉన్న ప్రతి ఒక్క కుటుంబాన్ని ఆరోగ్య శ్రీ పరిధిలోకి చేర్చడంతో రాష్ట్రంలో 90శాతం కుటుంబాలు పథకం ద్వారా లబ్ధి పొందుతాయన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఆరోగ్య శ్రీ పథకాన్ని సీఎం జగన్ మోహన్‌రెడ్డి మరింత బలోపేతం చేస్తున్నారన్నారు. టీడీపీ హయంలో ఆరోగ్య శ్రీ క్రింద 1059 జబ్బులకు చికిత్సలు/శస్త్ర చికిత్సలు ఉండగా జగన్ పాలనలో 3,257కు పెంచారన్నారు. అలానే శస్త్ర చికిత్సల అనంతరం సంవత్సరంపాటు ఉచితంగా మందులు అందించే మెడికల్ ప్యాకేజీలను కూడా పెంచారన్నారు. నెట్‌వర్క్ ఆసుపత్రుల బిల్లులను త్వరితగతిన చెల్లిస్తున్నారన్నారు. సమావేశంలో డీఎంఅండ్ హెచ్‌ఓ కొండయ్య, మాజీ ఎంపీపీ జనార్దన్‌రెడ్డి, నాయకులు, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలి

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని రామాపురం రోడ్డు మార్గంలో నామాల గుట్టపై నిర్మాణంలో ఉన్న నూతన అయ్యప్ప స్వామి ఆలయం త్వరితగతిన పూర్తి చేయడానికి భక్తులతోపాటు దాతల సహకరించాలని బండన్న స్వామి తెలియజేశారు. మంగళవారం నామాల గుట్టపై ప్రత్యేక పూజలు నిర్వహించిన బండన్న స్వామి కుటుంబ సభ్యులు అయ్యప్ప భక్తులతో కలిసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతం భక్తులతో ఖ్యాతి పొందుతుందన్నారు. ఆలయ నిర్మాణానికి అందరూ సహకారం అందించాలన్నారు. అయ్యప్ప గురు స్వాములు గంగరాజు, వెంకటేష్, నాగేంద్రబాబు, కొండూరు గంగాధర్ రాజు, సుధీర్ కుమార్, గాలివీటి సురేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.